క్లుప్తంగా

పనికి వెళ్లి యువకుడి మృతి

యద్దనపూడి: కూలికి వెళ్లి యువకుడు అకస్మికంగా మృతి చెందిన ఘటన మండలంలోని జాగర్లమూడి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన పుసులూరి కిరణ్ (34) తన కుటుంబ పోషణ నిమిత్తం ఇంటి పునాదులు తీసేందుకు తన సమీప గ్రామమైన పోలూరు వెళ్లాడు. పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన సహచర కూలీలు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే మృతిచెందినట్లు స్థానిక వైద్యుడు తెలిపారు. కిరణ్ మృతిచెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ తమ్మలూరి ఎమేలమ్మ, బాపట్ల పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది కిరణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మట్టిఖర్చుల నిమిత్తం సర్పంచ్ ఎమేలమ్మ రూ.5 వేలు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడు కిరణ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

చినగంజాం: మండలంలోని చినగంజాం ప్రభుదేవా కాలనీలో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధం కావడంతో కట్టుబట్టలతో మిగిలిన కట్టా తిరుపతమ్మ కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల బ్రాంచ్ సాయమందించింది. అగ్నిప్రమాదంలో తిరుపతమ్మ నివాసం గృహం పూర్తిగా దగ్ధం కావడంతో పాటు ఇంటిలోని వంట సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు డీ ఇమ్మానియేలు సోమవారం ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి ఆ కుటుంబం తాత్కాలికంగా నివాసం ఉండేందుకు రెండు టార్పాలిన్ పట్టలు, వంట సామగ్రి, హైజిన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ మస్తాన్‌రావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు కట్టా శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల లెక్కలు తేల్చేశారు !


సూర్యనారాయణరెడ్డి

చీరాల టౌన్: ఎట్టకేలకు చీరాల నియోజకవర్గ ఓటర్ల లెక్కలు తేల్చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో వచ్చిన ఫారం–6 దరఖాస్తుల విచారణల అనంతరం నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితా ప్రకటించామని నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్వో వివరాలు వెల్లడించారు. చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాలతో పాటుగా చీరాల మున్సిపాలిటీలోని 33 వార్డుల్లో వచ్చిన ఫారం–6 దరఖాస్తులను విచారించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించామన్నారు. నియోజకవర్గంలో ఉన్న 218 పోలింగ్ కేంద్రాల బూత్‌లెవల్ అధికారులుకు అందించి విచారణ చేయించగా నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగిందన్నారు. చీరాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,02,711 ఉండగా వీరిలో పురుషులు 98,729, స్త్రీలు 1,03,958, థర్డ్ జండర్ 24 మంది ఉన్నారని ఆర్వో తెలిపారు. నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే స్త్రీల ఓట్లు 5229 అధికంగా ఉన్నాయన్నారు. మేనెల 13న జరిగే ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేయడంతో పాటుగా నూతన ఓటర్లు అందరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామని ఆర్వో తెలిపారు.

జగన్ ఆశయాలకు వెన్నుదన్నుగా యువత

- పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ
- 200 మంది బాలాజీ యూత్ సభ్యులతో సమావేశం


యువ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి బాలాజీ

చినగంజాం: రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలన్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు యువత వెన్నుదన్నుగా నిలవాలని పర్చూరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. వైఎస్సార్ సీపీ చీరాల క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ యువ కార్యకర్తల సమావేశంలో చినగంజాం మండలానికి చెందిన సుమారు 200 మంది బాలాజీ యూత్ సభ్యులతో ఆయన స్వయంగా మాట్లాడారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు పార్టీలోని యువకులంతా ఐకమత్యంగా ఉండి ముందుకు సాగాలని బాలాజీ పిలుపునిచ్చారు. పార్టీలోని నాయకులతో యువ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, పార్టీ నాయకత్వం అందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు యువకులు కృషి చేయాలని, జగనన్న ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. యువకులకు అండగా తాను ఉంటానని ఎలాంటి సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని ప్రతి ఒక్క యువ కార్యకర్తకు తన సిబ్బందిని అందుబాటులో ఉంచుతానని తెలిపారు. పార్టీకోసం పనిచేసే మీకు ఎటువంటి సమస్యవచ్చినా భయపడాల్సిన అవసరం లేదని వారికి ఆయన భరోసా ఇచ్చారు. గ్రామాలలో నాయకులు చేయాల్సిన పనులు వారు చేస్తారని, యువత తమకు అప్పగించిన కార్యకలాపాలను విజయవంతంగా నెరవేరుస్తూ ముందుకు సాగాలన్నారు. రాబోయే ఎన్నికలలో పార్టీ విజయమే ధ్యేయంగా యువత కృషి చేయాలని ఆయన సూచించారు. చినగంజాం మండలం నుంచి ఆరు పంచాయతీలకు చెందిన యువ కార్యకర్తలు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీగా పార్టీ కార్యాలయానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


చినగంజాం మండలం నుంచి ర్యాలీగా బయలు దేరిన యువ కార్యకర్తలు

సంక్షేమం, అభివృద్ధే మా అజెండా

- అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి
- ప్రచారంలో పాల్గొన్న హనిమిరెడ్డి కుటుంబ సభ్యులు


యర్రబాలెంలో వృద్ధుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి

మేదరమెట్ల: సంక్షేమంతో పాటు అభివృద్ధి రెండూ రెండు కళ్లలా భావించి పరిపాలిస్తున్న జగనన్నను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. కొరిశపాడు మండలంలోని యర్రబాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో సోమవారం హనిమిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగితెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఎన్నికలలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. ప్రస్తుతం అమలు అవుతున్న పథకాలు తిరిగి అమలు కావాలన్నా మరిన్ని పథకాలను పేదప్రజానీకం అందుకోవాలంటే మనమందరం ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకురాలు విక్రం శ్రీదేవి, సర్పంచ్‌లు పీ.అంజలీ శ్రీధర్, బీ నాగరాజు ఎంపీటీసీలు పీ అనిల్ కుమార్, చిట్టేటి నిర్మల పాల్గొన్నారు.


మహిళలకు కరపత్రం అందిస్తున్న సుష్మ


కనగాలవారిపాలెంలో ప్రచారంలో పాల్గొన్న హనిమిరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి

హనిమిరెడ్డి సతీమణి ప్రచారం..

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి సతీమణి పానెం ఆదిలక్ష్మి ఎన్నికల ప్రచారంలో భాగంగా కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పంచాయితీ పరిధిలోని కనగాలవారిపాలెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు.

అద్దంకి రూరల్: సంతమాగులూరు లోని ఎస్సీ కాలనీలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కైపు మహేష్‌రెడ్డి సతీమణి సుష్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి, ఎంపీ సురేశ్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

మీ బిడ్డగా బాలాజీని అక్కున చేర్చుకోండి


మార్టూరు ముస్లిం కాలనీలో ప్రచారం చేస్తున్న బాలాజీ సతీమణి హరిత


ఎన్నికల ప్రచార ర్యాలీలో లక్ష్మి, నాయకులు

- ఎన్నికల ప్రచారంలో పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ కుటుంబ సభ్యులు

కారంచేడు: మీ, మా సోదరుడు, పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీని మీ బిడ్డగా ఆదరించాలని, అక్కున చేర్చుకొని ఆయనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని యడం బాలాజీ సోదరి యడం లక్ష్మి కుంకలమర్రు గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె మండలంలోని కుంకలమర్రు గ్రామంలో పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని నాయుడు బజారు, ముస్లిం కాలనీ, ఎస్సీ కాలనీలు, పుట్టాయి పాలెం, కాలువ సెంటర్లలో ఆమె ఇంటింటికీ తిరుగుతూ రాబోవు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, బాలాజీల గుర్తు అయిన ఫ్యాన్‌పై ఓటు ముద్రను వేసి అఖండ విజయంతో గెలిపించాలని కోరారు. మాహిళాభ్యున్నతని మన నేత వైఎస్ జగనన్న చేసిన, చేయబోతున్న అనేక సంక్షేమ పథకాల తీరును ఆమె మహిళలకు వివరించారు. కార్యక్రమంలో జువ్వా శివరామప్రసాద్, గ్రామ సర్పంచ్ ఈదర సౌందర్య, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా రత్నకుమారి, బత్తుల మధు, శివాజీ, కొత్తరెడ్డి బాలాజీ, వీరయ్య, అనిశెట్టి బ్రహ్మయ్య, కారంచేడు మండల జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్, యార్లగడ్డ పాపారావు, గాజుల రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యం

మార్టూరు: మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అధిక భాగం అవకాశాలు కల్పించిన జగనన్నను మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ప్రతి మహిళపై ఉందని పర్చూరు అభ్యర్థి యడం బాలాజీ భార్య యడం హరిత పిలుపునిచ్చారు. మండల కేంద్రం మార్టూరులోని ముస్లిం కాలనీ, పీర్ల చావిడి ఏరియాలో ఎన్నికల ప్రచారంలో ఆమె స్థానిక మహిళలతో మాట్లాడారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి ముస్లిం మైనారిటీలకు అందించిన 4 శాతం రిజర్వేషన్‌తో నేడు ముస్లిం యువత విద్యా, ఉద్యోగ ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందుతున్న వైనాన్ని ఎవరూ కాదనలేరన్నారు. ముస్లిం, మైనారిటీలకు అండగా ఉన్న ముఖ్యమంత్రి కావాలో మతతత్వ పార్టీలతో పొత్తు పెట్టుకున్న కిచిడీ పార్టీల కూటమి కావాలో నిర్ణయించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హరితకు ఘన స్వాగతం పలికిన నాయకులు ఆమె చేత పార్టీ గుర్తు గల భారీ కేక్ కట్ చేయించి కార్యకర్తలకు స్థానిక మహిళలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ భుక్యా శాంతిబాయి, సర్పంచి భుక్యా సునీతా బాయి, ఎంపీటీసీ రుక్సానా బేగం, వార్డు మెంబర్ మహబుల్లా, మండల కన్వీనరు పఠాన్ కాలేషావలి, సులేమాన్, గడ్డం మస్తాన్ వలి, సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రచారం

చినగంజాం: పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చినగంజాం మండల కేంద్రమైన చినగంజాంలో సోమవారం పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఓటర్లు తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేయాలని, సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబం ఆయనను గెలిపించాలని, సీఎం జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామని వారు ఓటర్లను కోరారు. ఇందులో భాగంగా చినగంజాంలోని చుండి బజార్, మసీదు పేట, కొఠారు రోడ్‌లలో పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఆమంచి వెంకట సుబ్బారావు, నల్లమోపు పద్మప్రియ, ఎస్సీ సెల్ కన్వీనర్ పాదర్తి ప్రకాష్, ఎస్ సుబ్బారెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు నూనె వెంకటేశ్వర్లు, ఏ శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, శిఖరం రామకృష్ణ, వాటుపల్లి బలరామయ్య, కొండపాటూరి బ్రహ్మయ్య, నల్లబోతుల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

టీడీపీకి ఓటేస్తే మళ్లీ కష్టాలే

- ఎన్నికల ప్రచారంలో కరణం కుటుంబ సభ్యులు


దేశాయిపేట ఇంటింటి ప్రచారంలో కరణం గీత, గోరంట్ల సుధారాణి

వేటపాలెం: టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే అని.. అయితే సంక్షేమ పథకాలు తిరిగి అమలు కావాలంటే కరణం వెంకటేష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ సతీమణి కరణం గీత, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి కుమార్తె గోరంట్ల సుధారాణి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం మండలంలోని దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నం, అయోధ్యనగర్‌లో కరణం వెంకటేష్‌కి మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలుకరించి ఈ ప్రభుత్వంలో పేద కుటుం బాలకు జరిగి మేలు, అభివృద్ధి గురించి వివరించారు. వీరికి మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఓట్లు వేసే ముందు ఆలోచన చేయాలన్నారు. మీరు వేసే ఓట్లు మన పిల్లలు, మన భవిష్యత్తుకు మేలు చేసేలా ఉండాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్‌ను, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని ఓటర్లును కోరారు. ప్రచార కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, మహిళా అధ్యక్షురాలు సీతామహాలక్ష్మీ, మండల ఇన్‌చార్జీ లేళ్ల శ్రీధర్, దంతం హనుమంతరావు, మాజీ ఎంపీపీ చల్లా జనార్దన్, కర్ణ లక్ష్మరావు, బట్ట శ్రీను, రాంబాబు, వెంకటేశ్వరరావు, పాపారావు, గట్టు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బండారు విజయ్, అనిల్, కే శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత, రాజశేఖర్, మల్లీ వైష్ణవి, కౌన్సిలర్ గోలి స్వాతి, ఎస్సీ సెల్ అధ్యక్షురాలు మార్పు బాలే, వాసిమళ్ల బ్రదర్స్ పాల్గొన్నారు.

హనిమిరెడ్డిని కలిసిన గుడిపాడు యూత్


హనిమిరెడ్డిని కలిసి సంఘీభావం తెలిపిన గుడిపాడు యూత్

బల్లికురవ: బడుగు, బలహీన వర్గాలు, యువతకు అందిస్తున్న తోడ్పాటు, మేనిఫెస్టోకు గ్రామాల వారీగా ఆకర్షితులవుతూ తనకు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారని ఆపార్టీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు సర్పంచ్ పసల అంజలీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యూత్ 20 మంది హనిమిరెడ్డిని కలిసి వైఎస్సార్ పార్టీ విజయానికి గ్రామాల వారీగా కృషిచేసి జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రకటించారు. హనిమిరెడ్డిని కలిసిన వారిలో పసల పవన్‌కళ్యాణ్, అంబటి అశోక్, మూరబోయిన దేవ, నాగార్జున, యాదాల వినోద్‌కుమార్, గోగుల కృష్ణ, రావులపల్లి తిరుపతయ్య, ఎర్రిబోయిన వెంకటేష్, ప్రదీప్ కుమార్, గోపిచంద్, పసల మణికంఠ, ఎస్‌కె అమీర్, అనిల్, తదితరులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు


రూట్ మార్చ్ చేస్తున్న పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలు


చీరాల అర్బన్: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలని టూటౌన్ సీఐ సోమశేఖర్ అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం టూటౌన్ పరిధిలోని కొత్తపేట, ప్రసాద్ నగర్, వివేకానందనగర్, ఆర్టీసీ కాలనీ, లక్ష్మీశ్రీనివాస కాలనీలో బీఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది రూట్ మార్చ్ నిర్వహించారు. ఈఎన్నికల్లో ఎలాంటి గొడవలు జరగకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని, ఘర్షణలకు పాల్పడే వారిపై నిఘా ఉంచామన్నారు. ఎన్నికల కమీషన్, జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఎక్కడా కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారాన్ని పోలీస్ అధికారులకు తెలియజేయాలని సీఐ సూచించారు.

45 మంది వలంటీర్ల రాజీనామా


రాజీనామా చేసిన వలంటీర్లతో అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్

చీరాల: చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ గెలుపుతో పాటుగా జనరంజక పాలన అందించిన సీఎం జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించేందుకు తామంతా సిద్ధమేనని పలువురు వలంటీర్లు అన్నారు. వైఎస్సార్ సీపీ బలోపేతం చేసి గ్రామ, వార్డు స్థాయిలో పాటుగా సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసేందుకు తమ వలంటీర్ పదవులకు రాజీనామా చేశారు. సోమవారం చీరాల మున్సిపాలిటీలోని 2,7,9,13,33 వార్డులో పనిచేస్తున్న వార్డు వలంటీర్లు 45 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారు. అలానే చీరాల మండలం పాతచీరాల గ్రామంలో 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. అనంతరం రాజీనామా చేసిన వలంటీర్లు వెంకటేష్‌ను రామకృష్ణాపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను వీడి వైఎస్సార్ సీపీలోకి


వైఎస్సార్ సీపీలో చేరిన నీలకంఠాపురం వాసులు

- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కరణం

చీరాల: నియోజకవర్గంలోని వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయితీ నీలకంఠాపురానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఆపార్టీని వీడి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సమక్షంలో సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీని వీడి పృథ్వీ వెంకటేశ్వర్లు, కొలుకుల శ్రీనివాసరావు, మాచర్ల పవన్‌కుమార్, గుత్తి వెంకట్రావు, పేరక మహేశ్వరరావు, సజ్జా శివయ్య, మాచర్ల ముత్యలింగం, గుత్తి అశోక్, మాచర్ల నాగసోమశేఖరరావు, యారాసు మల్లేశ్వరరావులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. ఆయనకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. చీరాలలో కరణం వెంకటేష్‌కు గెలుపునకు కృషి చేస్తామన్నారు.

పింఛన్ల పంపిణీకి జాబితా సిద్ధం

చినగంజాం: మండలంలోని పింఛను లబ్ధిదారులకు నగదు పంపిణీ చేసేందుకు జాబితా సిద్ధం చేసినట్లు ఎంపీడీవో యూబీ వరప్రసాద్ తెలిపారు. మండలంలోని 13 సచివాలయాల పరిధిలో మొత్తం 6066 మంది పింఛను లబ్ధిదారులుండగా వారిలో 1596 మందికి ఇంటికి సచివాలయ సిబ్బంది మే 1వ తేదీన నగదు పంపిణీ చేస్తారని తెలిపారు. మిగిలిన 4370 మందికి లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. ఇంటి వద్ద జమ చేసే లబ్ధిదారుల జాబితా సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌ల వద్ద ఉందని చెప్పారు.